- చేర్యాల చైతన్యవంతమైన ప్రాంతం
- ఈ పాంతమంటే నాకెంతో ఇష్టం
- చేర్యాలలోనే హిందీ విశారద పాసైన
- ఇక్కడే హిందీ నేర్చుకున్న.. ఇవాళ హిందీ బాగా మాట్లాడుతున్న
- ఉద్యమ సమయంలో బచ్చన పేట చౌరస్తాలో ఏడ్చిన
- బచ్చన్నపేట చెరువులో చారెడు నీళ్లు లేకుండే..
- నేడు చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి
- మన నెత్తి మీదనే మల్లన్నసాగర్ ఉంది..
- రంగనాయకసాగర్ నుంచి ధూళిమిట్టకు నీళ్లొస్తున్నాయి..
- ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో చర్చపెట్టండి
- యాదన్న గౌరవించి సపోర్టు చేసిండు.. యాదన్నకు, పొన్నాలకు ధన్యవాదాలు
- మా రాజేశ్వర్‌రెడ్డి ఎందుకో రందిపడుతుండు
- ఇయాళ మనస్సుకు చాలా తృప్తి ఉంది..
- చేర్యాల ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు

# గెలిచిన నెలరోజుల్లోనే..
# చేర్యాలను డివిజన్ చేస్తం



చేర్యాల సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సిద్దిపేట, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ''చేర్యాల ప్రాంతం చైతన్యమైన గడ్డ ,ఈ ప్రాంతం అంటే ఇష్టం ..చేర్యాల ఒకప్పుడు సమితి ఉండేది..ఆసమితి పోయింది..చేర్యాల నియోజకవర్గం ఉండేది..అదిపోయింది..ఏదో ఎలితి కనబడుతుంది. మీరు బాధతోనే ఉన్నారు. అందుకే రెవెన్యూ డివిజన్ కావాలని కోరుతున్నారు. మీరు రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించండి..నెల రోజుల్లోనే రెవెన్యూ డివిజన్ చేయించి బ్రహ్మాండంగా ప్రారంభోత్సవం చెద్దాం'' అని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హామీ ఇచ్చారు. జనగామ నియోజకవర్గ పరిధిలోని చేర్యాల పట్టణ కేంద్రంలో శనివారం '' ప్రజాఆశీర్వాద సభ'' జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సభకు స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య,ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్సీ రాజలింగం, జనగామ జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డితో పాటు ఎంపీపీలు, జడ్పీటీసీలు, ముఖ్యనాయకులు హాజరయ్యారు. 42 నిమిషాలు జనగామ నియోజకవర్గం ప్రజలను ఉద్దేశించి సీఎం కేసీఆర్ మాట్లాడారు. మీకు తెల్వని విషయం కూడా ఉంది. ఇక్కడ నాక్లాస్‌మెంట్లు అనేక మంది ఉన్నారని చెప్పారు. తామంతా రార పోరా అని పిలుచుకునేటోళ్లం,లద్దూనూరు, మద్దూరు, తరిగొప్పలలో వందల మంది ఉన్నారన్నారు. వాళ్లంతా తన ప్రాణ మిత్రులన్నారు. సిద్దిపేటలో ఇంటర్ చదువుకున్నప్పుడు చేర్యాలలో ఒక హిందీ టీచర్ ఉండే అని చెప్పారు. సైకిల్ మీద రోజూ సిద్దిపేట నుంచి ఇక్కడికి వచ్చి హిందీ నేర్చుకొని పోయానని, హిందీ విశారద పాసైంది కూడా ఇక్కడే అన్నారు. మీకు చాలా మందికి తెల్వదు..చేర్యాల సార్ వద్దనే హిందీ చదువుకునే బయటకు వెళ్లి హిందీ మాట్లాడుతున్నారన్నారు. హిందీలో మాట్లాడాలంటే గంటసేపు మాట్లాడుతానన్నారు. ఇక్కడ చదువుకున్న కాబట్టి ..చేర్యాల పెట్టిన భిక్ష అని చెప్పారు.



చేర్యాల సభలో యువకుడి ఉత్సాహం

### బచ్చన పేట చౌరస్తాలో ఏడ్చిన..

ఎన్నోసార్లు చేర్యాల నుంచి జనగామకు వెళ్లానన్నారు. మన పక్కకు ఉన్న చెరువులో ఎన్నడూ కూడా చారెడు నీళ్లు కనిపించలేదన్నారు. ఏరోజ కూడా నిండకపోతుండే, చాలా భయంకరమైన పరిస్థితి ఉండేదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బచ్చన్నపేట మండల కేంద్రం నుంచి పోతుంటే తన వెంట ఉన్న మిత్రులు ఇక్కడ మాట్లాడండి సార్ చాలా మంది ఉన్నారు అని ఆరోజు నాకు చెప్పితే అక్కడ ఆగానన్నారు. అక్కడ జీపు ఎక్కి మాట్లాడుతున్న సమయంలో అక్కడికి వచ్చిన వారంతా వృద్ధులు మాత్రమే ఒక యువకుడు కూడా లేరు. ఏమైంది ఒక్క యువకుడు కూడా లేడంటే ఎక్కడ సార్ గత కొన్నేండ్లుగా అంతా కరువు మొత్తం ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు పోయింద్రు అని చెప్పారన్నారు. వెంటనే జీపు దిగి అక్కడ ఉన్న వృద్ధులతో మాట్లాడితే ఆరోజు వారు చెప్పిన మాటలు తాగునీళ్లు కూడా దొరుకుతలేవు, నాలుగు కిలోమీటర్ల కొద్ది దూరం పోయి ఎడ్ల బండి మీద తెచ్చుకుంటున్నామని చెప్పారని గుర్తు చేశారు. ఏడేండ్లు అయింది మా చెరువు ఎండిపోయి చుక్క నీరు లేదు, బతకలేని పరిస్థితి ఉంది అని చెప్పితే తనకు దుఃఖం వచ్చి ఏడ్చానని చెప్పారు.ఇయాళ భగవంతుడి దయతో గత పదేండ్ల నుంచి బచ్చన్నపేట చెరువు నిండు కుండలా మారిందన్నారు.

### పల్లా రాజేశ్వర్‌రెడ్డి పనిమంతుడు

''పల్లా రాజేశ్వర్‌రెడ్డి చాలా తెలివిగలవాడు.. మంచి విద్యావంతుడు, ఉద్యమాల్లో పని చేసిన వాడు. కమ్యూనిస్టు సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసినవాడు,ప్రజాసమస్యలపై చాలా అవగాహన ఉన్నవాడు, పట్టున్న మనిషి'' అని సీఎం కేసీఆర్ అన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి గింత ఉషారు ఉన్నారని తనకు తెలియదన్నారు. చేర్యాల కాడ ఒక సభ పెడితే సాలు సార్ అని అన్నారు. ఇక్కడికి వచ్చిన తర్వాత జనం మధ్యన పెట్టి ఈ కళాశాల, ఆకళాశాల కావాలని అడుగుతున్నారు అని చెప్పారు. ఇంకో విషయం ఆలోచన చేయాలి.. గీన్ని కళాశాలలు అడిగినాడు అంటే రాజేశ్వర్‌రెడ్డికి ఆ ధైర్యం ఎక్కడిది..ఆయనకు అన్ని తెలుసు అని చెప్పారు. 33 మెడికల్ కళాశాలు పెట్టినం, అనేక ఇంజినీరింగ్ కళాశాలలు పెట్టినం, అనేక రకాలుగా ప్రభుత్వం వద్ద ధనం ఉందికాబట్టే ఆధైర్యం పల్లాకు వచ్చిందన్నారు. సమైక్య రాష్ట్రంలో ఉంటే మన గతి ఎట్లా ఉండే బచ్చన్నపేట చెరువోలే ఉండేదన్నారు.

### యాదన్నకు, పొన్నాలకు ధన్యవాదాలు

యాదన్నకు చెప్పాను...యాదన్న నీవు కూడా క్యాబినెట్ ర్యాంకులో ఆర్టీసీ చైర్మన్‌గా ఉండు, పెద్ద మనిషిగా గౌరవంగా ఉండు, నీ గౌరవం తక్కువ కావద్దు అని చెప్పి యాదన్నకు చెప్పాను అని సీఎం కేసీఆర్ అన్నారు. నామాట మన్నించి సపోర్టు చేసిన ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి, పెద్దలు పొన్నాల లక్ష్మయ్య వచ్చి రాజేశ్వర్‌రెడ్డిని ఆశీర్వదించింద్రు లక్ష్మయ్యకు ధనన్యావాదాలు . పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించండి చేర్యాల రెవెన్యూ డివిజన్‌తో పాటు ఆయన కోరిన ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు అన్ని తెచ్చిచ్చే బాధ్యత తనదే అన్నారు.కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

### గ్రామాల్లో చర్చపెట్టండి

బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాలను గ్రామాల్లో చర్చపెట్టండి. ఎక్కడికక్కడ చర్చ పెట్టడం వల్ల ప్రజలకు అన్ని విషయాలు తెలుస్తామని సీఎం కేసీఆర్ అన్నారు.



చేర్యాల సభలో డ్యాన్స్ చేస్తున్న యువకుడు

బీఆర్ఎస్ పదేండ్లలో ప్రజలకు ఏం చేసింది. కాంగ్రెస్ 50 ఏండ్లలో ఏంచేసిందో ప్రజలకు తెలుసన్నారు. గత పదేండ్ల నుంచి ప్రజల ఆశీస్సులతో బీఆర్ఎస్ ప్రభుత్వం నడుస్తుందన్నారు. తెలంగాణ రాక ముందు ఎలా ఉండే...రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎలా ఉందో ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. ఇయాళ కాంగ్రెస్ పార్టీవాళ్లు వచ్చి మాట్లాడుతున్నారు. ఎనకటికి ఎవరో అన్నరట వంటలు మీరు వండి పెట్టుండ్రి మేము వచ్చి వడ్డిస్తామన్నరట అట్లా ఉంది కాంగ్రెస్ వాళ్ల తీరు అని దుయ్యబట్టారు. తెలంగాణ కోసం కొట్లాడినవాడు ఎవడు..ఉద్యమం మొదలు పెట్టినవాడు ఎవడు..ఆనాడు పేగు తెగేదాక నినదించింది ఎవడు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది ఎవరు. సాధించిన తెలంగాణను నంబర్‌వన్ చేసింది ఎవరు..? 24 గంటల కరెంట్ తెచ్చింది ఎవరు..? ప్రతి ఇంటికి తాగునీరు తెచ్చింది ఎవరు..? ఇయాళ పంటలకు సాగు నీరు తెచ్చింది ఎవరు..? (ఇవన్నీ కేసీఆర్ చేసిండు అంటు ప్రజలు చెప్పారు) యాళ్లకు మేము వచ్చి వడ్డన చేస్తామంటారా అని కాంగ్రెస్, బీజేపీలపై సీఎం కేసీఆర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ రాక ముందు చెట్టుకొకరు, గుట్టకొకరు అయింద్రు.. వలసలు పోయింద్రు, రైతులు, చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఒక్కో రైతు వందల ఫీట్ల కొద్ది బోర్లు వేసి అప్పుల పాలయ్యారన్నారు. ఎందుకంటే చేర్యాల, సిద్దిపేట కలిసి ఉండే కదా ఆబాధలు తనకు తెలుసన్నారు. కాంగ్రెస్ రాజ్యంలో ఎన్ని బాధలు పడ్డామో ఈ ప్రాంత వాసులకు అన్ని తెలుసన్నారు. ఆనాడు గోడు గోడు ఏడ్చిన నాడు మనల్ని ఎవరన్న పట్టించుకున్నారా..? అని ప్రశ్నించారు. ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే ఎంత ఇబ్బంది పడ్డామో మనందరికీ తెలుసన్నారు.

### మా రాజేశ్వర్‌రెడ్డి ఎందుకో రందిపడుతుండు

'మా రాజేశ్వర్‌రెడ్డి ఎందుకో బాగా రంది పడుతుండు.. వాడు ఎవడో జనగామకు వచ్చి వర్రిపోయిండట ..కుక్కలు మత్తుగా వర్రుతాయి.. దాన్ని లెక్క పెడతామా మనం'అని సీఎం కేసీఆర్ అన్నారు. నిన్న జనగామలో వొర్రిపోయిన కుక్క ఏంచేసింది తెలుసా..? రైఫిల్ పట్టుకొని ఎవడ్రా తెలంగాణ ఉద్యమం చేసింది అంటూ కరీంనగర్‌కు పోయిండు..ఆ రోజు నుంచి ఆయన పేరు రైఫిల్ రెడ్డి అని పెట్టింద్రు, తాను పెట్టింది కాదు వాళ్లు పెట్టింద్రు అని అన్నారు.

### ఇయాళ మనస్సుకు చాలా తృప్తిగా ఉంది

ఇయాళ మనస్సుకు తృప్తిగా ఉంది.. నా పాతజాగకు వచ్చిన, రెండో విషయం హెలికాప్టర్‌లో రాలేదు. హెలికాప్టర్ వస్తే గన్‌మెన్ టైం చూపెడుతూ పోవాలి అని అంటాడని సీఎం కేసీఆర్ అన్నారు. కుదార్తగా నాలుగు మాటలు మాట్లాడుకున్నటైం ది. తెలంగాణ యాసలో అంతే కదా అని... కాసేపు నవ్వుకోగలిగాం చేర్యాలలో... (అంటూ నవ్వుతూ), చేర్యాలకు వస్తే తన సొంత ఊరికి వచ్చినట్లు ఉంది, ఆనందంగా మాట్లాడుకున్నాం. కాల్వల నీళ్లు కూడా మల్లన్నసాగర్ ప్రాజెక్టు 50 టీఎంసీలు నిండు కుండలాగా మన నెత్తి మీదనే ఉంది. తపాస్‌పల్లి రిజర్వాయర్ రూ. 350 కోట్లు మంజూరు చేసినం ఆకాల్వ పైప్ లైన్ పూర్తవుతుంది. అది పూర్తి అయ్యిందంటే బ్రహ్మాండంగా నీళ్లు వస్తాయి. చేర్యాలలో కరువు అనేది మళ్ల అడుగు పెట్టకుండా అట్లా కట్టు బంద్ చేసే బాధ్యత తనదే అన్నారు. అటు దేవాదుల వస్తది. .రంగనాయక సాగర్ నుంచి ఇటు ధూళిమిట్టకు నీళ్లు వస్తున్నాయన్నారు. మల్లన్నసాగర్ నుంచి కూడా నీళ్లు వస్తాయన్నారు. అనంతర ప్రజలకు సీఎం కేసీఆర్ ధన్యవాదాలు తెలిపారు.



యువకుల ఆనందహేల

## సీఎం కేసీఆర్ సభ సైడ్‌లైట్స్

- సీఎం కేసీఆర్ రాకకు ముందు కళాకారుల ఆట పాటలతో సభ మార్మోగింది.
- మిట్టపల్లి సురేందర్ పాటలు సభికులను ఆకట్టుకున్నాయి
- దరువు ఎల్లన్న పాటకు పల్లా రాజేశ్వర్ రెడ్డి చప్పట్లతో సభికులను ఉత్సాహపర్చారు.
- పల్లా రాజేశ్వర్‌రెడ్డి చంచల్‌గూడ జైలు జీవితాన్ని దరువు ఎల్లన్న సభలో గుర్తు చేశారు.
- సీఎం కేసీఆర్ సాయంత్రం 4.16 నిమిషాలకు సభాస్థలికి చేరుకున్నారు.
- సీఎం కేసీఆర్‌కు బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ బొడెకుంటి వెంకటేశ్వర్లు, జనగామ జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి స్వాగతం పలికారు.
- సీఎం కేసీఆర్ స్టేజీ పై నుంచి జనాలకు అభివాదం తెలియజేశారు.
- సీఎం కేసీఆర్‌కు చేర్యాల రైతుబంధు సమితి కోఆర్డినేటర్ తాడెం రంజిత బొట్టు పెట్టారు.
- మొదటగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్వాగతోపన్యాసం
- సాయంత్రం 4.34 నిమిషాలకు సీఎం కేసీఆర్ ప్రసంగం ప్రారంభం
- సీఎం కేసీఆర్ ప్రసంగానికి ఆద్యంతం హర్షధ్వానాలు చేసిన జనం, యువతీ యువకుల కేరింతలు
- సాయంత్రం 5.16 నిమిషాలకు సీఎం కేసీఆర్ ప్రసంగం పూర్తి
- సీఎం కేసీఆర్ ప్రసంగం అనంతరం తన చిన్ననాటి మిత్రులైన రాపెల్లి జనార్దన్, బొమ్మగాని అంజయ్యను ఆత్మీయంగా కలుసుకున్నారు.
- సీఎం కేసీఆర్‌కు పాదాభివందం చేసి బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా ఆశీర్వాదం తీసుకున్నారు.
- సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు నాయకులు పోటీపడ్డారు.
- సీఎం కేసీఆర్‌కు నాయకులు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేశారు.
- సభ పూర్తవ్వగానే కార్యకర్తలు పెద్దఎత్తున పటాకులు కాల్చారు.
- సిద్దిపేట సీపీ శ్వేత ఆధ్వర్యంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

– చేర్యాల/మద్దూరు(ధూళిమిట్ట)/ కొమురవెల్లి, నవంబర్ 18:



చేర్యాల సభలో యువత....